
సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



చెరువు కింద.. ఇసుక దందా

గుర్రంకొండ మండలం తరిగొండ, మర్రిపాడు గ్రామాల్లోని రామానాయిని, హరిహరాదుల చెరువుల నుంచి ఇసుకను ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. -8లో



పేదల ఆశాజ్యోతి జగ్జీవన్‌రాం

పేదల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రాం అని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. రాయచోటి కలెక్టరేట్‌లో జగ్జీవన్‌రాం జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 121 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మానవాళికి ఆదర్శనీయుడు.. జానకీ వల్లభుడు





ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి జి.శ్రీకాంత్‌రెడ్డి

రాజంపేట టౌన్/ రాయచోటి జగదాంబసెంటర్: మానవాళికి ఆదర్శనీయుడు.. జానకీ వల్లభుడైన శ్రీరామచంద్రుడు అని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం వారు వేర్వేరుగా పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. శ్రీరామనవమి సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగను ప్రజలందరూ రామలక్ష్మణుల్లా కలసిమెలసి, ఆనందభరితంగా జరుపుకోవాలని కోరారు. ప్రతి దంపతులు సీతారాముల్లాగా జీవించగలిగితే ధార్మికతతోపాటు సుఖశాంతులు వర్ధిల్లుతాయన్నారు.

పర్యావరణం దెబ్బతినకుండా రహదారి పనులు



అధికారులతో సమీక్షిస్తున్న ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అజయ్‌కుమార్ నాయక్

సిద్దవటం: అటవీ సంపద, పర్యావరణం, వన్యప్రాణులకు ఎలాంటి నష్టం లేకుండా జాతీయ రహదారి పనులు చేపట్టాల్సి ఉందని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అజయ్‌కుమార్ నాయక్ తెలిపారు. సిద్దవటం మండలంలోని జేఎంజే కళాశాల సమీపంలో ఉన్న కోతుల వంక బ్రిడ్జి సమీపంలో శనివారం కడప–రేణిగుంట ఎన్‌హెచ్ 716 రహదారికి సంబంధించిన అటవీశాఖ క్లియరెన్స్‌పై నేషనల్ హైవే తిరుపతి ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సైట్ ఇంజనీర్ దిలీప్‌తో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కమిటీ పరిశీలించి నేషనల్ హైవే అధికారుల ముందు కొన్ని ప్రతిపాదనలు ఉంచిందన్నారు. వన్యప్రాణుల కదలికల కోసం కమిటీ ప్రతిపాదనల మేరకు కనుమలోపల్లె గ్రామ పరిధిలోని కోతుల వంక బ్రిడ్జి నుంచి చర్చి వరకు 5.5 కి.మీ.ఎలివేటెడ్ రోడ్డు నిర్మించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్క్వాడ్ డీఎఫ్‌ఓ రాజశేఖర్‌బాబు, కడప డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్, సబ్ డీఎఫ్‌ఓ స్వామి వివేకానంద, ట్రైనీ డీఎఫ్‌ఓ శ్రీకాంత్, కడప రేంజర్ ప్రసాద్, ఎఫ్‌ఎస్‌ఓ, ఎఫ్‌బీఓలు, ఏబీఓలు పాల్గొన్నారు.

బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవం

- మెరిసిపోతున్న ఏకశిలా నగరి
- నేడు ధ్వజారోహణం
- 14 వరకు నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి

సాక్షి రాయచోటి: ఆంధ్ర భద్రాద్రిగా గుర్తింపు పొందిన ఏకశిలా నగరి బ్రహ్మోత్సవ శోభతో మురిసిపోతోంది. రాష్ట్ర విభజన అనంతరం ఒంటిమిట్ట రామాలయాన్ని అధికారికంగా గుర్తించి.. ప్రభుత్వ లాంఛనాలతో బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రత్యేకంగా తిరుమల–తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జగదభిరాముడి కల్యాణోత్సవం మొదలుకొని బ్రహ్మోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శనివారం రాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణతో శ్రీకారం చుట్టారు. ఆదివారం నుంచి ఈ నెల 14వ తేది వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు.

కనువిందు చేస్తున్న అలంకరణలు

ఏకశిలా నగరిలో శ్రీ కోదండరాముని బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంతోపాటు పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రధానంగా శ్రీరామ నవమి తరుణంలో ఒంటిమిట్టలో ఎక్కడ చూసినా విద్యుద్దీప కాంతులతో వెలుగొందేలా ఆకృతులను రూపొందించారు. అంతేకాకుండా ఆలయ పరిసరాల్లో రంగురంగుల విద్యుద్దీపాలు, విద్యుత్ కటౌట్లతో శోభాయమానంగా అలంకరించారు.



స్వామి, అమ్మవార్లకు అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

ఆలయ గోపుర పరిసర ప్రాంతంతోపాటు కల్యాణ మండపం ప్రాంతంలోనూ వెలుగులు విరజిమ్మేలా ఏర్పాట్లు చేశారు. ఎక్కడ చూసినా పుష్పాలంకరణ కూడా ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. భక్తులకు ఎండ తగలకుండా చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. పార్కులను సుందరంగా అలంకరించారు. అటు వైపు రథం, కోనేరు, ఆలయ పరిసరాలతోపాటు ఇటు హరిత హోటల్ నుంచి అటు స్వామి వారి కల్యాణ మండపం వరకు ఎటుచూసినా ఏకశిలా నగరి శోభాయమానంగా కనిపిస్తోంది.



విద్యుద్దీప అలంకరణలో కోదండ రామాలయం

11న స్వామి వారి కల్యాణం

ఒంటిమిట్ట కోదండ రామస్వామి కల్యాణానికి ప్రత్యేకత ఉంది. పండు వెన్నెల్లో చంద్రుని సాక్షిగా జరిగే జగదభిరాముని కల్యాణోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ నెల 11న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు ముత్యపు తలంబ్రాలు, అన్నప్రసాదాలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే కల్యాణోత్సవానికి సంబంధించి ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు సమర్పించడంతోపాటు గవర్నర్ కూడా హాజరయ్యే సంప్రదాయం ఉన్న నేపథ్యంలో.. బందోబస్తు పరంగా చర్యలు చేపడుతున్నారు. కల్యాణ మండప ప్రాంతంలో ఎల్‌ఈడీ కాంతులతో సుమారు 38 దేవతామూర్తుల ప్రతిరూపాలను ఏర్పాటు చేస్తున్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్లు, పోలీసు సిబ్బంది, పార్కింగ్, తాగునీటికి సంబంధించి మూడు లక్షల వాటర్‌బాటిళ్లు, 250 మంది వైద్య సిబ్బంది, అంబులెన్స్‌లు, అగ్నిమాపక సిబ్బంది, ఇలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు పోతన జయంతి

ఒంటిమిట్ట(రాజంపేట): ఒంటిమిట్టలో కోదండరాముని బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం పోతన జయంతిని తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నారు. ఒంటిమిట్ట కోదండ రామాలయం సమీపంలో పోతన విగ్రహాన్ని ఇది వరకే ఏర్పాటు చేశారు. అక్కడ పూజలు నిర్వహించనున్నారు.

ఒంటిమిట్టతో పోతనకు అనుబంధం

ఒంటిమిట్ట చెరువు కింద పోతనకు పొలం ఉంది. ఆయన నివాసం ఉంది. ఆయన నివాసమున్న ప్రాంతాన్ని ఆయన ఇంటి పేరుమీదనే పిలిచారు. దానిని ఇప్పటికీ బొమ్మిదిగడ్డ అనిపిలుస్తుంటారు. ఒకనాటి బమ్మెరగడ్డ ఈనాటికి బొమ్మిదిగడ్డ అయింది. ఆయన భాగవతాన్ని ఆంధ్రీకరించారు. ఆ రామునికే అంకితమిచ్చారు. భాగవతంలో పోతనకు లభించిన స్కంధాలు నాలుగు. అవి అయిదు, ఆరు, పదకొండు, పన్నెండు. మొదటి స్కంధంలో పోతన క్ష కైవల్యపదంబు అంటూ శ్రీకృష్ణపరమ్మాతను స్తుతించారు. ఇక ద్వితీస్కంధం నుంచి కృతిపతిని వర్ణించే పద్యాల్లో 'రఘు' శబ్ధంతో ముడిపడ్డ పదబంధాలే కనిపిస్తాయి.

భారీగా తరలి రానున్న భక్తులు

శ్రీరామ నవమి రోజు నుంచి భక్తులు భారీగా తరలి రానున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకోనున్నారు. బ్రహ్మోత్సవాలు ఈనెల 14వ తేది వరకు జరగనున్న నేపథ్యంలో.. ప్రతిరోజు పెద్ద ఎత్తున భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించనున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ ఏర్పాట్లు చేసింది.

శాస్త్రోక్తంగా అంకురార్పణ

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో జాంబవంతుడు ప్రతిష్ఠించిన శ్రీ కోదండరామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు శనివారం ఆలయ టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్ బాబు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. తొలుత ఉత్సవ నిర్వాహకుడు రాజేష్‌భట్టర్‌ను సంప్రదాయ బద్ధంగా ఆలయంలోకి తీసుకువచ్చారు. ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి, పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు వ్యాసాభిషేకం, ఆరాధన, అర్చన చేశారు. రాత్రి 6 నుంచి 8 గంటల వరకు అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ రంగ మండపంలో ఉత్సవ మూర్తులకు బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలు తొడిగి, తులసి గజమాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ నిర్వాహకుడు రాజేష్‌భట్టర్ ఉత్సవ మూర్తులకు అంకురార్పణ పూజలు నిర్వహించి, ఆలయంలోని పవిత్ర పుట్టమన్నును యాగశాలలో ప్రతిష్ఠించారు.

నేడు ధ్వజారోహణం

ఆదివారం ఉదయం 9:30 నుంచి 10:15 గంటల మధ్య వృషభలగ్నంలో ధ్వజారోహణం జరుగనుంది. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు పోతన జయంతి, కవి సమ్మేళనం, రాత్రి 7 నుంచి 9 వరకు శేషవాహన సేవ ఉంటాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, ఆలయ అర్చకులు, పండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.



పుట్టమన్ను తెస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

రాములోరి వేడుకకు రారండోయ్

- నేడు శ్రీరామ నవమి
- ఘనంగా ఏర్పాట్లు



సాక్షి రాయచోటి: సకల సద్గుణాలకు మారురూపుగా, మానవాళికి ఆదర్శంగా అపురూపమైన బంధాలకు ఆలవాలంగా నిలిచిన శ్రీరాముడు జన్మించిన శుభదినం. ఆయన సీతారాముడయ్యే శుభ లగ్నం వెరసి ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు జిల్లా అంతటా రామాలయాలు పండుగ శోభతో కళకళలాడుతున్నాయి. కేవలం రామాలయాలే కాకుండా దాదాపు అన్ని వైష్ణవాలయాలలో కూడా ఈ వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు.

కల్యాణ శోభ

జిల్లాలోని వైష్ణవాలయాలన్నీ ఆదివారం శ్రీరామ నవమి పండుగను నిర్వహించుకునేందుకు సిద్ధమయ్యాయి. ఒంటిమిట్టతోపాటు రాజంపేట, రాయచోటి, మదనపల్లె తదితర ప్రాంతాల్లో కూడా ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు భక్తులు సిద్ధమయ్యారు. భక్తజనం రామయ్య కల్యాణాన్ని నిర్వహించి భక్తులందరితో కలిసి ఆనందాన్ని ఆస్వాదించేందుకు సిద్ధమయ్యారు. జిల్లాలో చిన్న, పెద్ద రామాలయాలు, వైష్ణవాలయాలు దాదాపు 4 వేలకు పైగా ఉన్నాయి. ఉదయం 10.00 గంటలకు తర్వాత ఆయా ఆలయాల్లో వెసలుబాటు, పురోహితుల నిర్ణయాన్ని బట్టి శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు ఆయా ఆలయాల నిర్వాహకులు ప్రత్యేక వేదికలను సిద్ధం చేశారు. పలు పెద్ద ఆలయాలలో కల్యాణ అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులందరికీ కల్యాణ విందు ఏర్పాటు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

కల్యాణోత్సవంలో ప్రతి భక్తుడికి తలంబ్రాలు

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో ఏప్రిల్ 11న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి విచ్చేసే ప్రతి భక్తుడికి ముత్యపు తలంబ్రాలు, అన్నప్రసాదాలు అందజేసే ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ జేఈఓ వి.వీరబ్రహ్మం తెలిపారు. ఒంటిమిట్టలోని టీటీడీ పరిపాలన భవనం సమావేశ మందిరంలో శనివారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదిక ప్రాంగణం వద్ద ఉన్న 120 గ్యాలరీలలో ఉండే భక్తులతోపాటు కల్యాణం వీక్షించేందుకు వచ్చిన భక్తులందరూ శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని వీక్షించేలా ఏర్పా ట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వేదిక ప్రవేశ ప్రారంభంలో తలంబ్రాల పంపిణీ కోసం 16 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శ్రీ సీతారాముల కల్యాణోత్సవం తిలకించేలా 15 ఎల్‌ఈడీ స్క్రీన్‌లు, ఆలయం, కల్యాణ వేదిక తదితర ప్రాంతాలలో విద్యుత్ కాంతులతో 38 దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దాదాపు మూడు లక్షల తాగునీరు బాటిళ్లు, 250 మంది పారామెడికల్ సిబ్బంది, 35 మంది వైద్య నిపుణులు, 13 మెడికల్ టీమ్‌లు, ఎనిమిది అంబులెన్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కల్యాణ వేదిక, ఆలయ పరిసర ప్రాంతాలలో 12 టన్నుల సంప్రదాయ పుష్పాలు, లక్ష కట్ ఫ్లవర్స్‌తో పుష్పాలంకరణలు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లా రెవెన్యూ, పోలీసులు, టీటీడీ అధికారులతో కల్యాణ వేదిక ప్రాంగణం వద్ద ఏర్పాట్లను జేఈఓ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జాన్ ఎర్విన్, టీటీడీ సీఈ టీవీ సత్యనారాయణ, ఎస్‌ఈ ఎలక్ట్రికల్ వెంకటేశ్వర్లు, అన్నప్రసాదం ప్రత్యేక అధికారి కేఎల్ఎన్ శాస్త్రి, రవాణ శాఖ జీఎం శేషారెడ్డి, డిప్యూటీ ఈఓలు నటేష్ బాబు, ప్రశాంతి, సెల్వం, శివప్రసాద్, ఎస్టేట్ అధికారి గుణ భూషణ్‌రెడ్డి, డీపీపీ కార్యదర్శి శ్రీరాం రఘునాథ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేఈఓ వీరబ్రహ్మం

మామిడి.. తగ్గనున్న దిగుబడి

పండ్లలో రారాజు.. మామిడి. కానీ మామిడిని సాగు చేస్తున్న రైతుల పరిస్థితి మాత్రం ఏటా దారుణంగా తయారవుతోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, తెగుళ్లు, పురుగుల బెడద కారణంగా దిగుబడి తగ్గుతోంది. పర్యవసానంగా పెట్టుబడి కూడా రాకపోగా, నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు.

- తోటలపై ప్రతికూల వాతావరణ ప్రభావం
- మంచుతో మాడిపోయిన పూత
- తెగుళ్లతో రాలిపోయిన పిందెలు
- ఆందోళనలో రైతులు



మామిడి చెట్టు కింద నేలరాలిన పిందెలు



పూత, పిందెలు రాలిపోవడంతో తక్కువగా ఉన్న మామిడి కాయలు

రాయచోటి: ఈ ఏడాది మామిడి పంటపైన ప్రతికూల వాతావరణం తీవ్ర ప్రభావం చూపుతోంది. మూడేళ్లుగా నష్టాలు చూస్తున్న మామిడి రైతులకు.. ఈ ఏడాది నిరాశే మిగిలేలా ఉంది. పండ్ల తోటల్లో రారాజుగా పేరొందిన మామిడి వ్యాపారం ఈ ఏడాది కూడా డీలా పడింది. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 33 వేల హెక్టార్లకు పైగా వివిధ రకాల మామిడి చెట్లు సాగులో ఉన్నాయి. ఎకరాకు నాలుగు టన్నుల దిగుబడి వస్తుందని ఆశించగా.. టన్ను మించి వచ్చేలా లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మామిడి దిగుబడి బాగా ఉండి ఉంటే.. సుమారు వెయ్యి కోట్ల రూపాయల వ్యాపారం జరిగి ఉండేదని వ్యాపారులు చెబుతున్నారు. సాధారణంగా జిల్లాలో 3 లక్షల టన్నులకుపైగా దిగుబడి రావాల్సి ఉంది. కాసిన పిందెలు కూడా వేడి తెగుళ్ల కారణంగా రాలి పోతుండటంతో.. ఈ ఏడాది 1 లక్ష నుంచి 1.25 లక్షల టన్నులకు మించి దిగుబడి రాదని చెబుతున్నారు.

ఆశలు రేకెత్తించిన పూత

మామిడి చెట్లకు విరగబూసిన పూత.. మూడేళ్లగా పడ్డ కష్టాలు ఈ ఏడాది తీరుతాయని ఆశలు పుట్టించింది. పూత బాగానే వచ్చినప్పటికీ పొగమంచు, తేనెమంక తెగులు వ్యాపించి పూత 60 శాతంపైగా మాడిపోయి రాలిపోతోంది. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు మంచు కురవడంతో పూత నేల రాలిపోయింది. తెగుళ్లు చుట్టు ముట్టాయి. తెగులు నివారణకు ఇప్పటికే నాలుగైదు సార్లు మందులు పిచికారి చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ఎకరాకు సాధారణ ఖర్చు కంటే రూ.10 వేల నుంచి రూ. 20 వేల వరకు అదనపు ఖర్చు అయ్యిందని రైతులు వాపోతున్నారు. పొగమంచు కారణంగా తేనెబంక పురుగు రసం పీల్చే పురుగుల ప్రభావం ఎక్కువై పిందె దశలోనే కాయలు రాలిపోతున్నాయి.

మామిడికి పెట్టింది పేరు



అన్నమయ్య జిల్లా మామిడికి పెట్టింది పేరు. వరి, పూలు, కూరగాయల పంటలతో సమానంగా ప్రధా న పంట మామిడే. రైల్వేకోడూరు, రాయచోటి, రా జంపేట, పీలేరు, మదనపల్లి, తంబళ్లపల్లి నియోజకవర్గాలలో విస్తారంగా మామిడి తోటలు సాగవుతున్నాయి. రైల్వేకోడూరు, రాయచోటి మామిడి మార్కెట్‌కు అంతర్జాతీయ గుర్తింపు ఉంది. దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఇక్కడి నుంచి మామిడి పండ్లను ఎగుమతి చేస్తుండగా.. ఏటా సుమారు వెయ్యి కోట్ల మామిడి వ్యాపారం సాగుతుంది.

రాలిపోతున్నాయి



చెట్లకు కాసిన కాయలు ఎదుగుదల లేకపోగా.. పిందెలు రాలిపోతున్నాయి. విపరీతంగా పూత పూయడంతో మంచి దిగుబడి వస్తుందని ఆశించాం. అయితే మంచుతో పూత రాలిపోయింది. తామర పురుగు, ఇతర తెగుళ్లతో పిందె దశలోనే రాలిపోతున్నాయి. నాలుగో సంవత్సరం కూడా నష్టాలు తప్పవు. పూత అధికంగా ఉండటంతో నాలుగైదు సార్లు తెగుళ్ల రానివ్వకుండా నివారణ చర్యలు చేపట్టినా ఫలితం రాలేదు.

–ఆర్.వెంకట్రామిరెడ్డి, చాకిబండ, చిన్నమండెం

పిందె రాలకుండా...

పిందె రాలడాన్ని తగ్గించేందుకు 10 లీటర్ల నీటిని 2 మిల్లీ లీటర్ల ప్లానోఫిక్స్ కలిపి పూరెమ్మలు మొత్తం తడిలేలా పిచికారి చేయాలి.. లేదా 2,4 డీ 10 పీపీఎం గ్రామ 2,4 డీ పొడిని 100 లీటర్ల నీటిలో కలిపి ద్రావణాన్ని స్ప్రే చేస్తే ఫలితం ఉంటుందని ఉద్యానశాఖ అధికారి రవింద్ర బాబు తెలియపరిచారు.

తామర పురుగు ఉధృతి

మామిడిలో తామర పురుగు ఉధృతి ఎక్కువ ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం లాల్ బహాద్ ఖాదర్, సువర్ణరేఖ తదితర రకాలు కోతకు వచ్చాయి. బెంగళూరు, రసాలు, నీలం, బేనీషా, మరికొన్ని రకాలు పూత దశ నుంచి పిందె దశలో ఉన్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో మామిడికి తామర పురుగు అధికంగా ఆశించింది. ఒకవైపు భానుడి భగభగలు పుట్టిస్తుండగా.. మరోవైపు పూత, పిందెల నుంచి రసం పీల్చడం వల్ల కాయపై రాతి మంగు ఏర్పడి నాణ్యత దెబ్బతింటుంది. దీని నావారణకు తోటల్లో నీలం రంగు జిగురు అట్టలను ఎకరానికి 40 చొప్పున అతికించి వీటి ఉధృతిని గమనించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు రైతులకు సూచించారు.

- తామర పురుగులు 2 మిల్లీమీటర్ల పొడవు ఉండి జాలరు వంటి రెక్కలు కలిగి సూక్ష్మంగా ఉంటాయి. ఇవి కొత్త చిగురువచ్చే దశలో ఆకులపై అసంఖ్యాకంగా చేరి గోకి రసాన్ని పీల్చేస్తాయి. దీంతో చిగురు ఆకులు చాలా చిన్నవిగా ఉండి.. ఆ తరువాత రాలిపోతాయి. పిందె ఏర్పడే దశలో కాయపై చర్మాన్ని గోకి బయటకు వచ్చిన రసాన్ని పీల్చి వేస్తాయి. ఇవి ఆశించిన కాయలపై రాతి మంగు లేదా ఏనుగు మంగు ఏర్పడి కాయ నాణ్యత పడిపోతుంది.

శ్రీ సౌమ్యనాథుని ఆలయానికి గ్రాంట్ మంజూరు

కడప కల్చరల్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయ ఉద్యోగుల జీతభత్యాల కోసం గ్రాంట్–ఇన్–ఎయిడ్ మంజూరుకు ప్రభుత్వం అంగీకరించిందని ప్రభుత్వ కార్యదర్శి వి.వినయ్‌చంద్ తెలిపారు. ఆలయ నిర్వహణలో భాగమైన అర్చకులు, ఉద్యోగుల జీతభత్యాల కోసం గ్రాంట్–ఇన్–ఎయిడ్ ఇచ్చేందుకు అనుమతి మంజూరు చేయాలని టీటీడీ ఈఓ ప్రభుత్వాన్ని కోరారు. స్పందించిన ప్రభుత్వం గ్రాంట్–ఇన్–ఎయిడ్ మంజూరుకు అనుమతించింది. కేవలం శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయానికి మాత్రమేకాకుండా టీటీడీ పాలన పరిధిలోగల మిగతా 32 ఆలయాలకు కూడా ఈ అనుమతులు వర్తిస్తాయని ఆయన తెలిపారు. టీటీడీ ఈఓ తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించినట్లు ఆయన వివరించారు.

నూతన కార్యవర్గం

రాయచోటి టౌన్: రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా జి.రఘురామయ్య, ఉపాధ్యక్షుడిగా ఎస్.శ్యామ్ సుందర్‌రెడ్డి, సెక్రటరీగా బాలమురళీ కృష్ణ, జాయింట్ సెక్రటరీగా బి.చంద్రమోహన్, ట్రెజరర్‌గా ఎం.సుధాకర్ రాజు, మహిళ విభాగంలో మహిళ సెక్రటరీగా అల్తాఫ్ భాను, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా జి.వెంకటరమణ, సలహాదారుగా అరుణమ్మ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జి. రామకృష్ణారెడ్డి, పరిశీలకుడిగా రవీంద్రరెడ్డి వ్యవహరించారు.

క్లుప్తంగా

ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



మదనపల్లె : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి(70) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పది రోజుల క్రితం పట్టణంలో అపస్మారస్థితిలో పడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనారోగ్యం విషమించి అతడు మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని మార్చురి గదికి తరలించారు. మృతుడి ఒంటిపై రోజ్ కలర్ షర్టు ఉందని, సంబంధీకులు ఉంటే టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

సిద్దవటం : పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. సిద్దవటం మండలం జంగాపల్లె పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న మూలపల్లె, మాచుపల్లె గ్రామాల్లో తనిఖీలు చేశామని తెలిపారు. డ్రైవర్ వద్ద ఎలాంటి బిల్లులు లేకపోవడంతో ట్రాక్టర్లు సీజ్ చేసి సిద్దవటం తహసీల్దారుకు అప్పజెప్పామని ఎస్‌ఐ తెలియజేశారు.

చెరువు కింద.. ఇసుక దందా

- జేసీబీలతో ఇసుక తోడేస్తున్న వైనం
- ఇష్టానుసారంగా ట్రాక్టర్లతో అక్రమ రవాణా
- తూతూ మంత్రంగా అధికారుల చర్యలు

ఇసుకాసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జేసీబీలతో ఇష్టానుసారంగా ఇసుక తోడేస్తూ యథేచ్ఛగా తరలించేస్తున్నారు. మండలంలోని తరిగొండ, మర్రిపాడుతోపాటు ఇతర ఇరిగేషన్ చెరువులు ఇసుక ట్రాక్టర్లతో నిండి జాతరను తలపిస్తున్నాయి. ఇంతజరుగుతున్నా అధికారులు తూతుమంత్రంగా చర్యలు తీసుకొని చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలున్నాయి.



కొత్తపల్లె చెరువులో జేసీబీతో ఇసుక తోడి ట్రాక్టర్లకు నింపుతూ..



రామానాయిని చెరువులో జేసీబీతో తవ్వుతూ...

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ, మర్రిపాడు గ్రామాల్లోని రామానాయిని చెరువు, హరిహరాదుల చెరువులు వందలాది ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. వీటితోపాటు అమిలేపల్లె, ఎం.కొత్తపల్లె చెరువులు పెద్దచెరువులే. వీటిలో ఇసుక నిల్వలు భారీగా ఉండడంతో ఇసుకాసురుల కళ్లు పడ్డాయి. అంతే ఇంకేముంది.. జేసీబీలు పెట్టి చెరువుల్లో ఇసుకను అక్రమంగా తోడేస్తున్నారు. ఒక జేసీబీకి నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్లు ఏర్పాటు చేసిమాకు అడ్డేమంటూ.. ఇష్టానుసారంగా తరలించేస్తున్నారు. ముందుగా పై భాగంలో రెండు నుంచి నాలుగు అడుగుల మేరకు ఉన్న మట్టిని తొలగించేస్తున్నారు. తవ్వేసిన మట్టిన ట్రాక్టర్ల ద్వారా తరలించి ఇటుక బట్టీలకు విక్రయిస్తున్నారు. ఆ తరువాత టన్నుల కొద్దీ నిల్వలు చెరువుల్లో బయటపడుతున్నాయి. అనంతరం పట్టపగలే జేసీబీతో ఇసుక తవ్వి తరలిస్తున్నారు. ఒక్కో చెరువులో 15 నుంచి 20 అడుగుల లోతు వరకూ గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. గతంలో మామిళ్లవారిపల్లె చెరువులో ఇసుక కోసం తీసిన గొయ్యి కుప్పకూలి ఓ కూలీ మృతిచెందిన సంఘటనలు చోటు చేసుకొన్నాయి.

పక్క మండలాలకు తరలుతున్న ఇసుక

మండలంలోని మర్రిపాడు, తరిగొండ, అమిలేపల్లె, శెట్టివారిపల్లె, బోడిగుట్ట సమీప చెరువుల్లో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. కొంతమంది వ్యక్తులు చెరువులను ఆక్రమించేశారు. వాటిలో చేరిన టన్నుల కొద్దీ ఇసుకను బహిరంగంగా టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలించేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా రోజూ పదుల కొద్దీ ట్రాక్టర్ల ఇసుక పక్కనే ఉన్న వాల్మీకీపురం, కురుబలకోట, పెద్దమండ్యం మండలాలకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుక బయట ప్రాంతాల్లో రూ.3 వేల నుంచి రూ.3300 వరకు విక్రయిస్తున్నారు.

ఇంటి నిర్మాణాలు, ప్రభుత్వ పనుల సాకుతో

స్థానిక నేతలు ఇళ్ల నిర్మాణాలు, ఇటీవల మంజూరైన ప్రభుత్వ భవనాల నిర్మాణాల నిమిత్తం ఇసుక తరలిస్తున్నామని చెప్పి దందా సాగిస్తుండడంతో దోపిడీ మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. మరికొందరు మండలంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులను సాకుగా చూపించి రోజుల తరబడి ఇసుక తోడేస్తూ లక్షలాది రుపాయలు సొమ్ము చేసుకొంటున్నారు. జేసీబీలతో తోడేయమని ఎక్కడా ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. అయినా ఇవేవీ తమకు పట్టవంటూ కొందరు నేతలు జేసీబీలతో తోడేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ఓ వర్గం నేతలు ఇటీవల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన సంఘటనలు చోటు చేసుకొన్నాయి.

చోద్యం చూస్తున్న అధికారులు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తూ కాలం వెళ్లదీస్తున్నారనే విమర్శలున్నాయి. గతంలో కొద్ది రోజుల పాటు రెవెన్యూ అధికారులు చెరువు వద్ద హడావిడి చేసి అక్రమ రవాణాను అరికట్టామంటూ ప్రచారం చేసుకున్నారు. రెండు రోజుల పాటు చెరువుల వద్ద కాపలాగా ఉన్నారు. అయితే ఇవేవీ పట్టనట్లు ఇసుకాసురులు మూడవ రోజు నుంచి షరా మామూలే అన్న చందంగా రవాణా సాగిస్తున్నారు. అధికారులు చేసేదిలేక చెరువుల వైపు వెళ్లడం మానేశారని రైతులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకొంటాం



తరిగొండతోపాటు ఇతర గ్రామాల చెరువుల్లో ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకొంటాం. ఇప్పటికే అప్రమత్తంగా ఉండాలని స్థానిక వీఆర్వో, వీఆర్‌ఏలను ఆదేశించాం. గ్రామాల్లో రవాణాపై నిఘా ఉంచాం. నిబంధనలను ఉల్లంఘించి ఇసుక తరలిస్తే వాహనాలు సీజ్ చేసి కేసు నమోదు చేయిస్తాం.

– శ్రీనివాసులు, తహసీల్దార్, గుర్రంకొండ

గట్టి నిఘా పెడుతున్నాం



మండలంలోని రామానాయిని చెరువు, హరిహరాదుల చెరువుల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తాం. గతంలో కొద్ది రోజుల పాటు చెరువుల వద్ద నిఘా ఉంచాం. ఇక మీదట చెరువుల్లో ఇసుక అక్రమంగా తరలించే వాహనాలను సీజ్ చేసి చట్టపరంగా చర్యలు చేపడతాం.

– మధురామచంద్రుడు, ఎస్‌ఐ, గుర్రంకొండ

ఈత సరదా తీసింది ప్రాణం



శివ (ఫైల్)

పులివెందుల రూరల్ : మండు టెండల్లో ఉపశమనం కోసం సరదాగా ఈతకు వెళ్లిన యువకుడు, ఓ విద్యార్థికి అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందిన వైనం శనివారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. పులివెందుల మండలం అచ్చివెళ్లి పంచాయతీ పరిధిలోని కానేపల్లె గ్రామానికి చెందిన సుబ్బరాయుడి కుమారుడు శివ(26) పులివెందుల పట్టణంలో ఉద్యోగం చేస్తున్నాడు. తన ఇంటి సమీపంలో కుంట వద్దకు శనివారం సరదాగా ఈత కొట్టడానికి వెళ్లారు. ఈ సమయంలో అతడికి ఫిట్స్ రావడంతో నీటిలో మునిగి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. పెద్ద దిక్కుగా మారిన కొడుకు చనిపోవడంతో తల్లి దండ్రులు, బంధువులు బోరున విలపించారు.

ముమ్మడిగుంటపల్లెలో మరొకరు..



శ్రీనివాసులు (ఫైల్)

సిద్దవటం : మండలంలోని ముమ్మడిగుంటపల్లె వ్యవసాయ పొలాల్లోని బావిలో ఈతకు వెళ్లి ఫిట్స్ రావడంతో మరో విద్యార్థి మృతి చెందాడు. బంధువుల కథనం మేరకు.. ఒంటిమిట్ట మండలం చెన్నకొత్తపల్లె గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి తమ్మిశెట్టి శ్రీనివాసులు(16) శనివారం మధ్యాహ్నం గ్రామస్తులు, స్నేహితులతో కలిసి ముమ్మడిగుంటపల్లె వ్యవసాయ పొలాల్లోని బావిలో ఈత కోసం వెళ్లారు. బావిలో ఈత కొట్టి బయటకు రాగానే శ్రీనివాసులుకు ఫిట్స్ రావడంతో అక్కడికకక్కడే మృతిచెందారు.

లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు



స్వామికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో వేకువ జామునే స్వామికి అభిషేకాలు, అర్చన నిర్వహించి అనంతరం తోమాల సేవ, ఏకాంతసేవ గావించారు. రంగు రంగుల పుష్పాలతో అలంకరించగా భక్తులు ఆలయానికి చేరుకొని స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

నగదు చెల్లించాలని దాడి

కలకడ : హామీ ఇచ్చి..ఇప్పించిన నగదు చెల్లించాలని ఒకరిని కొట్టి గాయపరచిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామాంజనేయులు వివరాల మేరకు.. మండలంలోని నవాబుపేట పంచాయతీ మండ్యేవారిపల్లెకు చెందిన రవీంద్రరెడ్డి అదే గ్రామానికి చెందిన రమణారెడ్డి వద్ద రూ.50 వేలు అప్పుగా కల్లూరుకు చెందిన బ ఆషాకు ఇప్పించారు. అయితే బాషా నగదు చెల్లించక పోవడంతో శుక్రవారం హామీ ఇచ్చిన రవీంద్రారెడ్డిని అప్పిచ్చిన రమణారెడ్డి, మునిరెడ్డి, తదితరులు కొట్టి తీవ్రంగా గాయపరిచారు. క్షతగాత్రుడు రవీంద్రారెడ్డి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెళ్లయిన ఏడాదికి భర్తపై పోక్సో కేసు

బి.కొత్తకోట : పెళ్లయి ఏడాది గడిచి, పాప పుట్టిన తర్వాత మైనర్ బాలికను వివాహం చేశారని గుర్తించి కర్ణాటక రాష్ట్రం బట్లపల్లిలో కేసు నమోదు చేసిన వైనం ఆలస్యంగా వెలుగు చూసింది. సీఐ జీవన్ గంగనాథ్‌బాబు వివరాల మేరకు.. కర్ణాటకలోని బట్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓబులాపురానికి చెందిన లలితకు తల్లిదండ్రులు లేరు. ఏడాది కిందట 17ఏళ్ల వయసులో బి.కొత్తకోట మండలం గుడిపల్లికి చెందిన మల్లి కార్జున(35)ను వివాహం చేసుకుంది. లలిత గర్భం దాల్చడంతో కర్ణాటక రాష్ట్రం చింతామణి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లింది. అక్కడి వైద్యులు వయస్సు ఆరా తీసి బట్లపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి బి.కొత్తకోట మండలంలో వారు ఉండడంతో ఆ స్టేషన్‌కు బదిలీ చేశారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో లలిత భర్త మల్లికార్జునపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ దంపతులకు ఒక పాప కూడా పుట్టింది.

వడదెబ్బతో దివ్యాంగుడు మృతి



కుల్లూరు నరసింహులు (ఫైల్)

రాజంపేట రూరల్ : ఎండ వేడిమి అధికం కావడంతో వడదెబ్బ సోకి దివ్యాంగుడు కుల్లూరు నరసింహులు(38) శనివారం మృత్యువాత పడ్డారు. పట్టణ శివారులోని డీబీఎస్‌పల్లి అరుంధతి వాడకు చెందిన కుల్లూరు చిన్న నరసింహులు, రంగమ్మలకు ఆరుగురు సంతానం. తల్లిదండ్రులు మరణించడంతో పెద్ద కుమారుడు శ్రీనివాసులు బేల్దారి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇతనికి తోడుగా దివ్యాంగులైన నరసింహులు, చెంగలరాయుడు బేల్దారి పనికి వెళ్తున్నారు. ఈ క్రమంలో నరసింహులుకు శుక్రవారం నుంచి విరేచనాలు, వాంతులయ్యాయి. శనివారం తీవ్రం కావడంతో తన గృహంలో కుప్పకూలిపోయాడు. హుటాహుటిన పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే డీ హైడ్రేషన్ కారణంగా నరసింహులు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని ఆయన బంధువు మహేశ్వరి తెలిపారు. దాతలు ఆదుకోవాలని కోరారు.

రెండు జేసీబీలు, ట్రాక్టర్ సీజ్

కలికిరి : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు జేసీబీలు, ఒక ట్రాక్టరును సీజ్ చేసినట్లు సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని మేడికుర్తి పరిధిలోని బాహుదానదిలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా జేసీబీలతో ట్రాక్టర్లకు ఇసుక వేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. నదిలో ఉన్న రెండు జేసీబీలను, ఒక ట్రాక్టరును సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం తహశీల్దారుకు అప్పగించనున్నట్లు చెప్పారు.

ఏఎల్‌సీసీ మూవీ టీజర్ రిలీజ్



చిత్ర యూనిట్‌తో విశ్వం ప్రభాకర్‌రెడ్డి

కురబలకోట : ఏఎల్‌సీసీ(ఓ యూనివర్సల్ బ్యాచిలర్) మూవీ టీజర్‌ను అంగళ్ల వద్ద విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన ఫంక్షన్‌లో విశ్వం విద్యా సంస్థల అధినేత ఎం.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్‌ఆర్ ఫిల్మ్ సర్క్యూట్స్ బ్యానర్‌పై నిర్మించిన ఏఎల్‌సీసీ చిత్రం విజయం సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. చిత్ర హీరో జెపి.నవీన్, దర్శక, నిర్మాత కోలా లెలీదర్‌రావుకు గుర్తింపు రాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరో నవీన్, నటులు శ్రీనివాసరెడ్డి, ధనుష్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రమణారెడ్డి, ఎఎల్‌సీసీ చిత్ర బృందం పాల్గొన్నారు.

ఇద్దరు అంతర్ జిల్లా దొంగల అరెస్టు

రూ.4 లక్షల సొత్తు స్వాధీనం



అంతర్‌జిల్లా దొంగలను అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు

మదనపల్లె : షట్టర్లు తొలగించి దుకాణాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో అంతర్ జిల్లా దొంగల అరెస్టు వివరాలను శనివారం మీడియాకు ఆయన వెల్లడించారు. కర్నూలు జిల్లా గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన గుజిరీ వ్యాపారి మాదిగజార్జి(26), అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం భైరవగుట్టకు చెందిన బండపల్లిరెడ్డిశేఖర్(23) ముఠాగా ఏర్పడ్డారు. అన్నమయ్య జిల్లా కురబలకోట, మదనపల్లె, గుర్రంకొండ తదితర ప్రాంతాల్లో దుకాణాల షట్టర్లు తొలగించి దొంగతనాలకు పాల్పడ్డారు. దీంతో జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు క్రైమ్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో విచారణ చేపట్టామన్నారు. సాంకేతికతను ఉపయోగించి నిందితులకు సంబంధించిన పక్కా సమాచారం తెలుసుకున్నామని పేర్కొన్నారు. శనివారం ఉదయం కురబలకోట మండలం కడప–మదనపల్లె రోడ్డులోని కడప క్రాస్ వద్ద నిందితులను అరెస్ట్ చేశామన్నారు. నిందితుల నుంచి కురబలకోట, గుర్రంకొండ, మదనపల్లె, చిత్తూరు, ఆదోని పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులకు సంబంధించిన వస్తువులు...సోనీ టీవీ, ల్యాప్‌టాప్, 50 కిలోల కాపర్‌వైర్, మూడు ట్యాబ్‌లు, ఒక టేబుల్ ఫ్యాన్, సిగరెట్లు, ఆటోరిక్షా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.4 లక్షలు ఉంటుందన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. కేసు విచారణలో ప్రతిభ కనపరిచిన సీఐ చంద్రశేఖర్, రూరల్ సీఐ సత్యనారాయణ, ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్, స్టేషన్ సిబ్బందిని డీఎస్పీ డి.కొండయ్యనాయుడు అభినందించారు.

సింహ వాహనంపై శ్రీరాముడి చిద్విలాసం



సింహవాహనంపై పట్టాభిరాముడి నగరోత్సవం



విశేషంగా ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

- కల్పవృక్ష వాహనంలో సీతారామలక్ష్మణులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురం పట్టాభిరాముడి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా మూడో రోజు శనివారం పట్టాభిరాముడు సింహవాహనంపై చిద్విలాసం చేశారు. తెల్లవారుజామున సుప్రభాతసేవతో ప్రారంభించి శుద్ధి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం జరిపారు. అనంతరం కల్పవృక్ష వాహనంపై శ్రీరాముడు తిరుమాడ వీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు స్నపన తిరుమంజనసేవ, రాత్రి 7 గంటలకు ఊంజల్‌సేవ కన్నుల పండువగా జరిగింది. అనంతరం రాత్రి 8 గంటలకు సీతాలక్ష్మణ సమేతుడైన పట్టాభిరాముడిని సింహ వాహనంపై కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో ఊరేగించగా భక్తులు దర్శించుకుని మంత్రముగ్ధులయ్యారు. స్థానిక కృష్ణదేవరాయ బలిజ సంఘం ఆధ్వర్యంలో కేరళ వాయిద్యాలు, బెంగళూరు నుంచి మహిళా వీరగాసి జానపద నృత్యంతోపాటు వివిధ జానపద నృత్యాలు, బళ్లారి డ్రమ్స్ భక్తులను విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ మునిబాల మార్, ఆలయ అధికారి కృష్ణమూర్తి, అర్చకులు కృష్ణప్రసాద్, కృష్ణమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

పట్టాభిరాముని సేవలో మాజీ ఎమ్మెల్యే చింతల

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయంలో శనివారం జరిగిన స్నపన తిరుమంజనం మహోత్సవ సేవలో పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతలరామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు వేద మంత్రోచ్చరణతో ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, నాయకులు ఆనందరెడ్డి, న్యాయవాది అశోక్‌రెడ్డి, క్రిష్ణమూర్తి తదితరులు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి జగ్జీవన్‌రాం

రాజంపేట టౌన్ : పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రాం అని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యలయంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి శనివారం ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన సమానత్వం, అంటరానితనం నిషేధం, జమీందారి వ్యవస్థ రద్దు విషయాలను స్వాతంత్ర్యానికి ముందే ప్రజలకు పరిచయం చేసిన సమతావాది బాబు జగ్జీవన్‌రాం అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన గొప్ప మహనీయుడు జగ్జీవన్‌రాం అన్నారు. పంటలకు సాగు నీటి వసతి కల్పన, నాణ్యమైన విత్తనాల సరఫరాతో దేశంలో ఆహార కొరత లేకుండా చేశారని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా, రాజకీయ నేతగా జగ్జీవన్‌రాం దేశానికి చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విద్యా సంస్థల అధినేత పోలా రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు దండు గోపి, దాసరి పెంచలయ్య, కమలాకర్, బొజ్జా పెంచలయ్య, వెంటేశ్వర్లు, జెనుగు కృష్ణారావు యాదవ్, డి.భాస్కర్‌రాజు, పాపినేని విశ్వనాథ రెడ్డి, దయానంద, వడ్డే రమణ, మిర్యాల సురేఖ, సుజాత, గోవర్ధన్‌రెడ్డి, కూండ్ల రమణారెడ్డి, సనిశెట్టి నవీన్‌కుమార్, రాముయాదవ్, బాల్‌రెడ్డి, జాహీద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రాం సేవలు చిరస్మరణీయం

– జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి : స్వాతంత్ర్య సమరయోధుడు బాబూ జగ్జీవన్‌రాం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లో జగ్జీవన్‌రాం జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మానవతావాది, సుపరిపాలనాదక్షుడు జగ్జీవన్‌రాం దేశానికి మహోన్నతమైన సేవ చేశారన్నారు. కేంద్ర క్యాబినేట్ మంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా మూడు దశాబ్దాలకు పైగా దక్షతతో దేశానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ మధుసూదనరావు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి జయప్రకాష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపనకు కృషి చేద్దాం

– ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి : మహనీయుల ఆదర్శాలను పాటిస్తూ సమ సమాజ స్థాపనకు కృషి చేద్దామని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పిలుపునిచ్చారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం, సామాజిక సమానత్వం కోసం అలుపెరగని పోరాటం చేసిన ఆదర్శ నేత, మంచి నాయకుడిగా ప్రజల మనస్సుల్లో చిరస్మరణీయుడు బాబు జగ్జీవన్‌రాం అని కొనియాడారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, అణగారిన వర్గాలకు, సమాన హక్కుల కోసం ఎనలేని పోరాటం చేసి ప్రజలచే బాబూజీ అని పిలిపించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటాద్రి, ఏఆర్ ఆర్‌ఐలు, వీజే.రామకృష్ణ, ఎం.పెద్దయ్య, శంకరమల్లయ్య, మధు, సిబ్బంది పాల్గొన్నారు.





జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆకేపాటి, కలెక్టరేట్ కార్యాలయంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ, తదితరులు



జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు